సాక్షి జనగామ

శుక్రవారం | 28 | ఫిబ్రవరి | 2025



ప్రయోగాల పాఠశాల..
ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నూతన ఆవిష్కరణలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. - 8లో▸



నైపుణ్యాలతో విద్యావకాశాలు
నైపుణ్యాలతోనే విద్యార్థులకు విద్యావకాశాలు లభిస్తాయని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $35^0/17^0$
ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.

అగ్ని గుండాలు

బచ్చన్నపేట : కొడవటూరు స్వయంభూ సిద్దేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం ఉదయం అగ్ని గుండాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఈఓ చిందం వంశీ, ప్రధాన పూజారి ఓం నమఃశివాయ ఆధ్వర్యాన ఉదయం అర్చకులు భద్రకాళి మాతకు శాంతి పూజల అనంతరం అగ్ని గుండం పూజా కార్యక్రమాలు చేపట్టారు. ప్రధాన పూజారి ఓం నమఃశివాయ తొలుత అగ్ని గుండ ప్రవేశం చేయగా శివసత్తులు, భక్తులు అనుకరించారు. అగ్ని గుండాల వద్ద తోపులాట జరగకుండా నర్మెట సీఐ అబ్బయ్య, ఎస్సై ఎస్‌కే.హమద్ ఆధ్వర్యాన బందోబస్తు చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టం అయిన గెలుపు ఆశీర్వాదంలో నూతనంగా వేద మంత్రాలు, విన్యాసాలు నేర్చుకున్నవారు తమ గురువుల ముందు ప్రదర్శించారు. అలాగే ఉత్సవాల విజయవంతానికి సహకరించిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్, సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భానుప్రకాష్ రెడ్డి, బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొడవటూరులో అగ్నిగుండాలు తొక్కుతున్న అర్చకులు

పెద్దపట్నం

తిమ్మంపేటలో మల్లికార్జున స్వామి కొండపై వేసిన పెద్దపట్నం



జఫర్‌గఢ్: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మండల పరిధి తిమ్మంపేట గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం రుద్రాభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పెద్దపట్నం వేసి మొక్కు చెల్లించుకున్నారు. డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, శివనామస్మరణతో కొండ ప్రాంతం మార్మోగింది. ఆ తర్వాత మహిళలు స్వామి వారికి బోనాలు సమర్పించారు. అలాగే తమ్మడపల్లి(జి) గ్రామంలో దూడల మల్లన్న జాతర వైభవంగా నిర్వహించారు. యాదవ కులస్తులు, మహిళలు పిల్లాపాపలతో కలిసి బోనాలతో ఊరేగింపు ఆలయానికి చేరుకున్నారు. ఉప్పుగల్లులో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం వద్ద పెద్దపట్నం వేసి మొక్కు చెల్లించారు.

రథోత్సవం

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి డి.రవీంద్రశర్మ దంపతులు, ఏసీపీ అంబటి నర్సయ్య, ఈఓ సల్వాది మోహన్‌బాబు, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్ రథోత్సవాన్ని ప్రారంభించారు. కోలాట కళాకారుల ప్రదర్శన, భక్తి గీతాల ఆలాపనతో పురవీధుల గుండా సాగిన రథోత్సవానికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. గుట్ట నుంచి గుడివాడ చౌరస్తా, గ్రామ పంచాయతీ, హనుమాన్ టెంపుల్, రాజీవ్ చౌరస్తా మీదుగా నిర్వహించిన రథోత్సవంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. అర్చకులు డీవీఆర్.శర్మ, అనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జడ్జి దంపతులు స్వామివారికి అభిషేకం నిర్వహించారు. జాతరలో జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాల, స్టేషన్‌ఘన్‌పూర్ విద్యాజ్యోతి డిగ్రీ కళాశాలల ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు సేవలందించారు.



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న జడ్జి రవీంద్రశర్మ దంపతులు, తదితరులు

న్యూస్‌రీల్

నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షించాలి : కలెక్టర్

జనగామ రూరల్: తాగు, సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీరు వృథా కాకుండా కాల్వలను సందర్శించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఈ సుధీర్, స్టేషన్‌ఘన్‌పూర్ ఈఈ వినయ్‌బాబు, ప్రవీణ్, మంగీలాల్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రేపు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లోని శ్రీ రామాంజనేయ కమిషన్ వ్యాపారి కందుకూరి రామాంజనేయులు రెండు రోజుల క్రితం మృతి చెందగా.. మార్చి ఒకటో తేదీన మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ గురువారం తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాగా మృతుడి కుటుంబాన్ని చైర్మన్‌తోపాటు కార్యదర్శి నరేంద్ర, అడ్తి ప్రతినిధి మాశెట్టి వెంకన్న, ట్రేడర్లు, వ్యాపారులు, హమాలీ ప్రతినిధులు పరామర్శించారు.

ఔషధ కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు



జనగామ: పట్టణ పరిధి స్వర్ణ కళామందిర్ రోడ్డులోని పాండు మెడికల్ ఏజెన్సీలో అభ్యంతరకర ప్రకటనలతో ఉన్న డ్రగ్స్‌ను సీజ్ చేసి, సదరు కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వరంగల్ ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం జిల్లా ఔషధ తనిఖీ అధికారి ఏలె బాలకృష్ణతో కలిసి ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇండోర్‌కు చెందిన ఓ కంపెనీ డ్రగ్స్‌పై నిబంధనలు ఉల్లంఘిస్తూ అభ్యంతరకర ప్రకటనలు ఉన్నాయని, ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా సీజ్ చేసి జనగామ కోర్టుకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

రిజర్వేషన్లు శాస్త్రీయంగా కేటాయించాలి



జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణలో రిజర్వేషన్లను శాస్త్రీయంగా కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. జనగామ పట్టణంలో గురువారం జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్ ఆధ్వర్యాన నిర్వహించిన ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల ఉద్యమ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ సమర్పించిన నివేదిక లోపభూయిష్టంగా ఉందని, వివిధ కులాలను గ్రూప్‌లలో చేర్చే అంశంలో, రిజర్వేషన్ల కేటాయింపు విషయంలో నిర్దిష్టమైన ప్రామాణిక సూత్రాలను పాటించలేదన్నారు. గ్రూప్–1లో ఉన్న మన్నె, పంబాల కులాలను గ్రూప్–3లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ పోరులో అమరులైన మాదిగల త్యాగాలు వెలకట్టలేనివని, మార్చి 1న సంస్మరణ దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. తాళ్లపల్లి కుమార్, రవీందర్, జెరిపోతుల సుధాకర్, బిర్రు నాగేష్, బొట్ల మహేష్, రవి, ఎల్లస్వామి పాల్గొన్నారు.

పోలింగ్ @ 94.31%



జిల్లా కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు



జనగామ పోలింగ్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు
- జిల్లాలో రెండు చోట్ల వందశాతం.. బచ్చన్నపేటలో అత్యల్పం
- ఓటింగ్‌కు దూరంగా 57 మంది
- కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు
- కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ వివరాలు..

జిల్లా	ఓటర్లు	పోలైనవి	శాతం
జనగామ	1,002	945	94.31
హనుమకొండ	5,215	4,780	91.66
వరంగల్	2,352	2,214	94.13
మహబూబాబాద్	1,663	1,571	94.47
భూపాలపల్లి	329	308	93.62
ములుగు	628	583	92.83

జనగామ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,189 మంది ఓటర్లు ఉండగా 10,401 మంది ఓటు హక్కును వినియోగించుకోగా మొత్తంగా 92.95 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే జనగామ జిల్లాలో ఎన్నికలను కలెక్టర్, ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా పర్యవేక్షించారు. 1,002 మంది ఓటర్లకుగాను 945 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ తరిగొప్పుల, జఫర్‌గఢ్‌లో నూరు శాతం కాగా.. అత్యల్పంగా బచ్చన్నపేటలో 87.14 శాతం నమోదైంది. పోలింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమైన సాయంత్రం 4 గంటలకు ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీసీపీ రాజమహేంద్రనాయక్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు చేపట్టారు. జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 511 ఓట్లు ఉండడంతో టీఎస్‌యూటీఎఫ్, పీఆర్‌టీయూ, తపస్, బీసీటీఏ, టీపీటీఎఫ్ నాయకులతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, మాజీ అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, రాష్ట్ర నాయకులు కేవీఎల్ఎన్.రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు.



పోలీస్ ఎస్కార్ట్ సహాయంతో బ్యాలెట్ బాక్స్‌లను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ స్టేషన్‌తో పాటు లింగాలఘణపురం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సెంటర్‌లో పోలింగ్ సరళిని కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న ఆధ్వర్యాన తహసీల్దార్లు, ఇతర ఉన్నతాధికారులు పోలింగ్ తీరును గమనించారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఎస్కార్ట్‌ల సహాయంతో ఓటింగ్ బాక్స్‌లను నల్లగొండకు తరలించారు.

- మరిన్ని ఫొటోలు 9లో▸

ఓట్లు ఎందుకు తొలగించారు?

జిల్లా కేంద్రం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం పరిధిలో సుమారు 19 ఓట్లు తొలగించారని ధర్మకంచ జూనియర్ కళాశాల లెక్చరర్లు ఎ.శ్రీకాంత్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా చేర్యాల, మిడిదొడ్డి జూనియర్ కళాశాల అధ్యాపకులు కె.శ్రీధర్, గొల్లూరి రామచంద్రయ్య వాపోయారు. దశాబ్దంన్నర క్రితం నుంచి కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తూ రెండేళ్ల క్రితం రెగ్యులర్ అయ్యామని, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఓటు వేయడానికి రాగా జాబితాలో పేర్లు లేవని, సిద్దిపేటలో పని చేస్తున్న తమ పేర్లను జనగామ డీఐఈఓకు తొలగించే హక్కు ఎక్కడిదని నిలదీశారు. ఈ విషయమై సంబంధిత ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు.





తమ ఓట్లు తొలగించారని చెబుతున్న లెక్చరర్లు శ్రీధర్, రామచంద్రయ్య, శ్రీకాంత్ తదితరులు

వసంతోత్సవానికి వేళాయె..

నేటినుంచి నిట్‌లో 'స్ప్రింగ్ స్ప్రీ–25'
- మార్చి 2 వరకు నిర్వహణ

- దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్
- హాజరుకానున్న పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు
- ప్రారంభించనున్న హాస్యనటుడు బ్రహ్మానందం





కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతీ ఏడాది విద్యార్థులే నిర్వాహకులుగా మూడు రోజులపాటు వసంతోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ–25) నిర్వహించనున్నారు. నేటి(శుక్రవారం) నుంచి మార్చి 1, 2 తేదీల్లో నిర్వహించే కల్చరల్ ఫెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. నాటి ఆర్‌ఈసీ నేటి నిట్‌లో ప్రపంచంలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. భిన్నత్వంలో ఏకత్వంలా నిలుస్తున్న నిట్‌లో వివిధ దేశాల సంస్కృతీ సంప్రదాయలను పరస్పరం పంచుకునేందుకు 1978లో ప్రారంభమైన వసంతోత్సవం దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కల్చరల్ ఫెస్ట్‌గా పేరుగాంచింది. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరుకానున్నారు.

తొలిరోజు: తొలిరోజు శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో హాస్యనటుడు, గిన్నిస్ వరల్ రికార్డు గ్రహీత, పద్మశ్రీ బ్రహ్మానందం, విద్యార్థుల చిట్‌చాట్.

రెండో రోజు: శనివారం ప్రోషోలో భాగంగా ఇండియన్ రాక్‌బ్యాండ్ వార్డెక్స్ ఫ్యూజన్ మ్యూజిక్‌తో అలరించనున్నారు. డైరెక్టర్ కట్స్‌లో సినీ డైరెక్టర్లతో చిట్‌చాట్. అల్యూర్‌లో భాగంగా ఫ్యాషన్ షో, నుక్కడ్ నాటక్ ప్రదర్శన.

మూడో రోజు: ముగింపులో భాగంగా ఆదివారం పాపులర్ సింగర్ అమిత్ త్రివేది హిందీ, ఇంగ్లిష్ సంగీత విభావరి. నిపుణులతో టెక్‌స్టంట్స్.

ఈసారి థీం లేదు: స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను ప్రతి ఏడాది ప్రత్యేక థీంతో నిర్వహించేవారు. 2022లో సృష్టిగా, 2023లో కళాధ్వనిగా, 2024లో రాసంగేస్ థీం(ఇతివృత్తం) తో నిర్వహించారు. ఈసారి అదేపేరుతో స్ప్రింగ్ స్ప్రీ–25ను నిర్వహించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రతిభను వెలికితీసేందుకు..



యువతలోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు స్ప్రింగ్ స్ప్రీ–25 వేదికగా నిలువనుంది. ప్రధానంగా సంగీతం, నృత్యం, కళలు, వినోదం పలు రంగాల్లో ప్రతిభను గుర్తించేందుకు కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నాం. ఈ వేడుకల్లో పాల్గొనే విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని నింపేందుకు సినీనటుడు బ్రహ్మానందం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు.

- డి.శ్రీనివాసాచార్య, నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్

కలర్‌ఫుల్‌గా కల్చరల్ ఫెస్ట్




నాటి ఆర్‌ఈసీలో 1978 సంవత్సరం ప్రారంభమైన స్ప్రింగ్ స్ప్రీ నేడు దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద కల్చరల్‌ఫెస్ట్‌గా పేరుగాంచింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను పంచుకునే వేదికగా ఏర్పాటు చేసిందే స్ప్రింగ్ స్ప్రీ. నిట్‌లో 41 వసంతోత్సవ వేడుకలను స్ప్రింగ్‌స్ప్రీ–25గా జరుపుకుంటున్నాం. మూడు రోజుల పాటు ఈ వేడుకలను కలర్‌ఫుల్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

- బిద్యాధర్ సుబుదీ, నిట్ డైరెక్టర్

వసూళ్లకు 30 టీంలు



కలెక్టర్ చేతుల మీదుగా కమిషనర్‌కు పన్ను చెల్లిస్తున్న వ్యాపారి



దుకాణ యజమానికి రెడ్ నోటీసు జారీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

పన్ను బకాయిల వసూలు ముమ్మరం
- రంగంలోకి కలెక్టర్ రిజ్వాన్ బాషా
- రెడ్ నోటీసులు జారీ..
- పట్టణంలో యాక్షన్ బృందాలు
- చెల్లించకుంటే ఆస్తుల జప్తు కూడా..!
- 'సాక్షి' వరుస కథనాలకు స్పందన

సాక్షి ఎఫెక్ట్..

జనగామ: జనగామ మున్సిపాలిటీలో దీర్ఘకాలికంగా బకాయి ఉన్న ఇంటి, నల్లా పన్నుల వసూళ్లలో మరింత వేగం పెంచేందుకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్వయంగా రంగంలోకి దిగారు. 'పన్నుల వసూళ్లలో పూర్.. 'రెడ్ నోటీసులు రెడీ' శీర్షికలతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు కలెక్టర్ స్పందించారు. గురువారం కమిషనర్ వెంకటేశ్వర్లతో కలిసి వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానుల వద్దకు వెళ్లి పెండింగ్ ఆస్తిపన్ను చెల్లించాలని కోరగా.. వారు తక్షణమే స్పందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు 95 శాతానికి చేరుకోగా.. మున్సిపల్ పరిధిలో పాతవి, కొత్తవి కలుపుకుని ఆస్తి పన్ను రూ.5.71కోట్లు ఉండగా.. రూ.2.32 కోట్లు(40.63 శాతం) వసూలు చేశారు. పురపాలికలో నూరు శాతం పనుల వసూలు లక్ష్యంతో 30 మంది వార్డు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో యాక్షన్ టీంలను రంగంలోకి దింపినట్లు కలెక్టర్ వివరించారు. ఇంటి పన్నులు ఆరు నెలలకోసారి, ఫైనల్‌గా ఏడాది లోపు చెల్లించాలని సూచించారు.

వారం రోజుల్లో చెల్లించకుంటే..

ఏళ్ల తరబడి పన్ను బకాయి ఉన్నవారి జాబితా ప్రకారం రెడ్ నోటీసు జారీ చేసి వారం రోజుల్లోపు చెల్లించని పక్షంలో ఆస్తులను సైతం జప్తు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. తెలంగాణ మున్సిపల్ యాక్ట్ ప్రకారం ప్రతి సంవత్సరం పన్ను చెల్లింపుల్లో క్లియర్‌గా ఉండాలని, సిటిజన్ రెస్పాన్స్ తప్పనిసరి అని పేర్కొన్నారు. భవనాలు విక్రయించాలన్నా.. కొనుగోలు చేయాలన్నా.. ప్రభుత్వం పథకాలు పొందాలన్నా ఇంటి, నల్లా పన్నులు క్లియరెన్స్ రశీదు ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వర్లు రెవెన్యూ సిబ్బందితో కలిసి మొండి బకాయి దారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుత బకాయి దారులకు రెడ్ నోటీసులు ఇవ్వొద్దని పలువురు వ్యాపారులు కమిషనర్‌ను కోరారు. రెవెన్యూ సిబ్బంది మధు, నర్సయ్య, కృష్ణవాసు, బాబురావు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అన్నదాత

- ఎండిన వరితో నిరసన
- గోదావరి జలాలు విడుదల చేయాలని ఇరిగేషన్, కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వివిధ గ్రామాలకు చెందిన రైతులు

జనగామ రూరల్: యాసంగి సిజన్‌లో సాగు చేసిన వరి పంటకు నీరు లేక ఎండి పోతుండడంతో కడుపు మండిన అన్నదాతలు రోడ్డెక్కారు. గోదావరి జలాలు విడుదల చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ జనగామ మండలంలోని పెద్దపహాడ్, గోపిరాజుపల్లి, గానుగుపహాడ్, ఎర్రకుంటతండా, వడ్లకొండ గ్రామాలకు చెందిన రైతులు గురువారం జిల్లా నీటి పారుదల శాఖతోపాటు కలెక్టర్ కార్యాలయాల వద్ద ఎండిన వరితో ఆందోళనకు దిగారు. మండల పరిధి 21 గ్రామాల్లో యాసంగి వరి 20వేల ఎకరాల్లో సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్ల నుంచి చుక్క నీరు రావడంలేదు. 300 ఫీట్ల లోతుకు బోరు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చేతి కొచ్చే దశలో పంట ఎండిపోయో పరిస్థితి నెలకొనడంతో రైతులు రోడ్డెక్కారు. గండిరామారం నుంచి పంపింగ్ చేసి బొమ్మకూరు రిజర్వాయర్ కాల్వల ద్వారా నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతులు కోరారు. సకాలంలో నీరు రాకపోతే పంట పొలాలను పశువులకు మేతగా వదలాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రెండు రోజుల్లో నీరు వదులుతాం..

ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ మంగీలాల్ మాట్లాడుతూ.. రెండు రోజుల్లో నీళ్ల వదులుతామని చెప్పారు. సీఐ దామోదర్ ధర్నా వద్ద చేరుకుని రైతులను శాంతింప జేశారు. ఈ నిరసనలో ఆయా గ్రామాల రైతులు, మాజీ సర్పంచ్‌లు శానబోయిన శ్రీనివాస్, బొల్లం శారద, ఎడమ అయిలయ్య, కొత్ర శంకర్, కూకట్ల సిద్దిరాజు, కూకట్ల సత్తయ్య, మాలోతు రాజు, తులసీరాం, జయరాం, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు పట్టించుకోవడం లేదు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

గోదావరి జలాలతో గతంలో జిల్లా సస్యశామలం అయింది.. వరి పంట పుష్కలంగా సాగు చేశారు.. నేడు పంట ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. రైతులు ఎమ్మెల్యేను ఆయన నివాసం వద్ద కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. పెట్టుబడులకు అప్పులు చేసి.. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట చివరి దశలో నీరు లేక ఎండిపోతోందని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాను మంత్రులు పట్టించుకోవడం లేదని, అసలు గండిరామారం నుంచి పంపింగ్ చేయడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా నేడు పంటలకు ఈ పరిస్థితి వచ్చిందని, తక్షణమే కాల్వల ద్వారా నీరందించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పల్లా'

బహుమతుల ప్రదానం

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం సహృదయ సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహించిన తెలుగు భాష ఆహ్వాన నాటక పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బుధవారం రాత్రి 11 గంటలకు సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమం జరిగింది. గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'చిగురు మేఘం' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. అలాగే కొలకలూరుకు చెందిన శ్రీసాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'జనరల్ బోగీలు' నాటకాన్ని ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఎంపిక చేసి బహుమతి ప్రదానం చేశారు.

నైపుణ్యాలతో విద్యావకాశాలు

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : నైపుణ్యాలతోనే విద్యార్థులకు విద్యావకాశాలు లభిస్తాయని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ సెనేట్ హాల్‌లో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్ అధ్యక్షతన 'ఎక్స్‌ప్లోరింగ్ ఎడ్యుకేషనల్ ఆపర్చునిటీస్ ఇన్ ది యూఎస్ ' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అంకితభావం, పట్టుదల, మార్పుకు సిద్ధంగా ఉండడం లాంటి అంశాలతో లక్ష్యం సాధించొచ్చన్నారు. వర్సిటీలో అకడమిక్‌తో పాటు పూర్తి స్థాయి నైపుణ్యాల పెంపు దిశగా పనిచేస్తున్నామని వివరించారు. అనంతరం హైదరాబాద్‌లోని యూఎస్ కన్సలేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ అమెరికాలో విద్యార్థులకు అద్భుత విద్యావకాశాలు ఉన్నాయన్నారు. టీచింగ్‌లో నూతన టెక్నాలజీ వినియోగం పెరిగిందన్నారు. అమెరికాలో ఉన్నత విద్యతో విద్యార్థి జీవితం మారుతుందన్నారు. టెక్నాలజీ సాయంతో స్కిల్, టాలెంట్ పెంచుకోవాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ వి.రామచంద్రం, ఓఎస్డీ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు రాము, చిర్ర రాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రమణ, భిక్షాలు, బయో టెక్నాలజీ విభాగాధిపతి శాస్త్రీ, తదితరులు పాల్గొన్నారు.

'అకుట్' జనరల్ సెక్రటరీ పదవికి ఇద్దరు పోటీ

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం ముగిసింది. అధ్యక్ష పదవికి ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి పోటీ పడుతున్నారు. జనరల్‌సెక్రటరీ పదవికి బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, మ్యాథమెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ బరిలో నిలిచారు. పరిపాలనాభవనంలోని సెనేట్‌హాల్‌లో మార్చి 4న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. 5న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. కేయూ పరిధిలో 77 మంది అధ్యాపకులు ఓటర్లుగా ఉన్నారు.

ప్రయోగాల పాఠశాల..

నూతన ఆవిష్కరణలతో ముందుకెళ్తున్న నాచినపల్లి ప్రభుత్వ పాఠశాల

నేడు సైన్స్ దినోత్సవం



విలేజ్ ఇన్నోవేటర్ అవార్డు అందుకుంటున్న విద్యార్థి దినేశ్

- విద్యార్థుల ఎగ్జిబిట్లతో కార్పొరేట్‌కు దీటుగా దేశవ్యాప్త గుర్తింపు పొందుతున్న స్కూల్
- సైన్స్ ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, సుమలత ప్రోత్సాహంతో విద్యార్థుల ఆవిష్కరణలు

దుగ్గొండి: సైన్స్.. పుస్తకంలోని పాఠం కాదు. సమాజంలోని మూఢ నమ్మకాలను దూరం చేసే శాస్త్రం. విద్యార్థుల్లోని ఆలోచన శక్తిని పెంచడంతోపాటు నూతన ఆవిష్కరణల వైపు వారి దృష్టిని మరల్చడం.. ప్రశ్నించే తత్వం అలవర్చడ సైన్స్ లక్ష్యం. సరిగా ఇదే లక్ష్యంతో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందుకెళ్తోతుంది. నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తూ కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, వెలిదండి సుమలత ప్రోత్సాహంతో విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. ఇంటింటా ఇన్నోవేటర్ పోటీల్లో ఈజీ ప్యాడీ ఫిల్లింగ్ మిషన్ జిల్లా ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుని విలేజ్ ఇన్నోవేటర్ అవార్డును సొంతం చేసుకుంది. ఇదే పాఠశాల నుంచి ఏటీబీ.. ఏనీటైం బ్యాగ్ మిషన్ కేంద్ర మంత్రిత్వశాఖ నిర్వహించే స్టూడెంట్ ఇన్నోవేషన్ మారథాన్‌లో జాతీయస్థాయి గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో నేడు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆ పాఠశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం

ఈజీ ప్యాడీ ఫిల్లింగ్ మిషన్..

వ్యవసాయంలో రోజురోజుకూ కూలీల ఖర్చు పెరగడంతో పాటు కొరత ఏర్పడుతోంది. దీంతో సమస్యను అధిగమించడానికి పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి దినేశ్ తన పరిజ్ఞానంతో ఈజీ ప్యాడీ ఫిల్లింగ్ మిషన్‌ను తయారు చేశాడు. మొదట ఓ స్టాండ్ తయారు చేసి స్టాండ్‌కు గిన్నెలు అమర్చిన బెల్టును విద్యుత్ మోటారుకు అనుసంధానించాడు. మోటారు ఆన్‌చేయగానే బెల్టు తిరగడంతో ధాన్యం బస్తాలలో నిండుతుంది. ఒక వ్యక్తి మాత్రమే అవసరమవుతారు..



ఈజీప్యాడీ ఫిల్లింగ్ మిషన్‌ను చూపుతున్న విద్యార్థి దినేశ్

ఏటీబీ(ఎనీటైం బ్యాగ్)



ఏటీబీ మిషన్ చూపుతున్న విద్యార్థి రిషిక్

ప్లాస్టిక్ వాడకం విరివిగా పెరిగి భూమి కలుషితం కావడంతో పాటు ప్లాస్టిక్ సంచులలో తీసుకునే ఆహార పదార్థాలతో రకరకాల వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ తరుణంలో గుడ్డ సంచులను ఏటీబీ మిషన్‌ద్వారా తీసుకునే పరికరం రూపొందించాడు 10వ తరగతి విద్యార్థి రిషిక్. రూ.5 నాణెం మిషన్‌లో వేస్తే గుడ్డ సంచి వచ్చేలా తయారు చేశాడు. మిషన్‌లో 500 బ్యాగులు ఉంచేలా నిర్మించాడు. దీంతో పాటు మిషన్ లోపల ప్లాస్టిక్‌తో నష్టాలు, గుడ్డ సంచుల వల్ల లాభాలు, పర్యావరణ హితం కోరే విధంగా వివరించేలా స్పీకర్లు ఏర్పాటు చేశాడు. దీనిని బస్టాండ్ సెంటర్‌లు, కూరగాయాల మార్కెట్లు, రద్దీ ప్రదేశాలలో ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని వివరించాడు. ఒక్కో మిషన్‌కు రూ. 25 వేల ఖర్చు అవుతుంది. పరికరం తయారీకి కేంద్ర మంత్రిత్వశాఖ నిధులు మంజూరు చేయడానికి అంగీకరించింది.

కల్పనాచావ్లా సైన్స్ క్లబ్..

పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలు సుమలత విద్యార్థులతో కల్పనాచావ్లా పేరిట సైన్స్ క్లబ్‌ను ప్రారంభింపజేసి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి నూతన ఆలోచనలు స్వీకరిస్తూ వాటి ద్వారా నూతన ఆవిష్కరణలకు రూపం ఇస్తున్నారు. గ్రామంలో ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మూఢనమ్మకాలు, కరోనా కల్లోలం వంటి సైన్స్ నాటికలు ప్రదర్శించి జాతీయస్థాయిలో బహుమతులు అందుకున్నారు. ఇదే విధంగా ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో విద్యార్థులు ప్రతీ నెలా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ దృక్పథం కలిగిన విద్యార్థులను తయారు చేయడంలో పాఠశాల ముందు వరుసలో నిలుస్తోంది.

సైన్స్ టాలెంట్ టెస్టులో విష్ణువర్ధన్‌కు ద్వితీయ స్థానం

మహబూబాబాద్ అర్బన్ : సైన్స్ టాలెంట్ టెస్టులో మహబూబాబాద్ మండలం మాధావపురం జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థి నక్క విష్ణువర్ధన్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. 'నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలు' అనే అంశంపై ఈ 18వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఇందులో ధ్వని అనే పాఠంతో నాటి రేడియో నుంచి.. నేటి సెల్‌ఫోన్ వరకు పని చేస్తున్నాని, విద్యుత్ పాఠంతో చీకటిగా ఉన్న భూగోళాన్ని వెలుతురుగా మార్చి ప్రతి ఇంటిలో వెలుగులు నిండాయని, న్యూటన్ గమన నియమాల ద్వారా రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపగలుగుతామని, బేర్నౌలి సూత్రం ద్వారా రైట్ సోదరులు విమానాన్ని కనుగొన్నారని, ఆక్సిజన్ కనుగొనడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను బతికించగలుగుతామనే, తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. దీంతో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లో ఎస్‌సీఈఆర్ డైరెక్టర్ రమేశ్ చేతుల మీదుగా విష్ణువర్ధన్ బహుమతి అందుకున్నాడు.



సైన్స్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి అందుకుంటున్న విష్ణువర్ధన్

కాగా, భౌతికశాస్త్రం ప్రణాళిక ప్రకారం చదివితే సులువుగా నేర్చుకొవచ్చని ఉపాధ్యాయులు తెలిపారని విష్ణువర్ధన్ చెప్పాడు. పాఠాలు విన్న తర్వాత ఇంటికెళ్లి చదువుతానన్నాడు. దీంతో భౌతికశాస్త్రం సులువుగా అర్థమవుతోందన్నాడు.

కుమారుడి కళ్లెదుటే కనిపించని లోకాలకు..

బైక్‌ను ఢీకొన్న లారీ.. తల్లిదండ్రులు దుర్మరణం

- గుండెలవిసేలా రోదించిన కుటుంబీకులు..
- మల్లంపల్లిలో ఘటన



మహమూద్(ఫైల్)



షేక్ సైనా(ఫైల్)

ములుగు : కుమారుడి కళ్లెదుటే తల్లిదండ్రులు దుర్మరణం చెందారు. బైక్‌పై తల్లిదండ్రులు ముందు వెళ్తున్నారు. కుమారుడు వారికి కొద్ది దూరంలో వెనుక నుంచి మరో బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లిదండ్రులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ దృశ్యాన్ని చూసిన కుమారుడు గుండెలవిసేలా రోదించాడు. ఇక తనకు దిక్కెవరంటూ తల్లిదండ్రుల మృతదేహాలపై పడి బోరున విలపించాడు. ఈ ఘటన గురువారం ములుగు జిల్లా మల్లంపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన దంపతులు షేక్ మహమూద్(58), షేక్ సైనా(45)తమ కుమారుడు షబ్బీర్‌తో కలిసి రెండు బైక్‌లపై పని నిమిత్తం ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ వెళ్లారు. అక్కడి నుంచి శివరాత్రి సందర్భంగా రామప్ప వెళ్లారు. అనంతరం స్వగ్రామం బుధరావుపేటకు వస్తున్నారు. మల్లంపల్లి నుంచి వెళ్తున్న క్రమంలో మల్లంపల్లి– నర్సంపేట జాతీయ రహదారిపై నర్సంపేట వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ మహమూద్, షేక్ సైనా అక్కడికక్కడే దుర్మరణం చెందారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బావమరిది గఫూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరావు తెలిపారు. కాగా, తన కళ్లెదుటే తల్లిదండ్రులు దుర్మరణం చెందడంతో కుమారుడు షబ్బీర్ కన్నీరుమున్నీరుగా రోదించాడు.

గంటలో ఇంటికి చేరేవారు..

ఖానాపురం: రెక్కాడితే కానీ డొక్క నిండని కుటుంబం. ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపారం చేసుకునే ఆ కుటుంబంలో పెనువిషాదం చోటుచేసుకుంది. మరో గంటలో ఇంటికి చేరుకోవాల్సిన తరుణంలో మృత్యువు కబలించింది. వ్యాపారం పూర్తయిన అనంతరం ఇంటిబాట పట్టిన దంపతులు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబం బోరున విలపించింది.. ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన షేక్ మహమూద్, షేక్ సైనా దంపతులు రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జీవనోపాధి నిమిత్తం నెల రోజుల క్రితం ఆసిఫాబాద్‌కు వెళ్లారు. అక్కడి నుంచి శివరాత్రి సందర్భంగా రామప్ప వెళ్లారు. వ్యాపారం ముగిసిన అనంతరం బైక్‌పై మల్లంపల్లికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ములుగు జిల్లా మల్లంపల్లి మండల శివారులోని నర్సంపేట జాతీయ రహదారిపై లారీ.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మహమూద్ లారీ చక్రాల కింద నలిగిపోగా రోడ్డు పక్కన సైనా విగత జీవిలా పడింది. ఈ దంపతులకు నలుగురు సంతానం. కుమారుడు, కుమార్తెకు వివాహం కాగా మరో కుమార్తె, కుమారుడికి కావాల్సి ఉంది. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో రోదిస్తున్న తీరు పలువురిచేత కన్నీరు పెట్టించింది.

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి దుర్మరణం



ప్రసాద్(ఫైల్)

మంగపేట: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో మంగపేట మండల కేంద్రానికి చెందిన కిరాణా వ్యాపారి బొల్లా ప్రసాద్ (44) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, కారులో ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం గురువారం తెల్ల వారుజామున తాడ్వాయి మండల పరిధిలో జరిగింది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. ప్రసాద్ తన మిత్రులతో కలిసి జిల్లాలోని వెంకటాపురం(ఎం) మండలం పాలంపేటలోని రామప్ప ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు బుధవారం రాత్రి కారులో వెళ్లారు. దైవదర్శనం అనంతరం ఇంటికి వస్తున్న క్రమంలో తాడ్వాయి మండల పరిధిలోని జలగలంచ తోగు గుంపుల మధ్య అడవి జంతువు అడ్డుగా రావడంతో దానిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారు నడుపుతున్న ప్రసాద్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కారులో అతడి తోపాటు ఉన్న మంగపేటకు చెందిన బట్టలషాపు యజమాని శిద్ధశెట్టి శ్రీనివాస్, టీజీ ఎన్పీడీసీఎల్ మంగపేట ఏఈ రామసుబ్బరాయశర్మ, గుర్రం వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని ప్రసాద్ మృతదేహంతోపాటు క్షతగాత్రులను 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి తమ్ముడు బొల్లా సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానుకోట రైతుకు దేశవ్యాప్త గుర్తింపు

- బోడ వీరన్నకు జాతీయ స్థాయి అవార్డు ..
- అందజేసిన కేంద్ర మంత్రి సుశ్రీశోభా కరంద్లజే



కేంద్ర మంత్రి సుశ్రీశోభా కరంద్లజే నుంచి అవార్డు స్వీకరిస్తున్న రైతు వీరన్న (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

మహబూబాబాద్ రూరల్ : మానుకోట రైతుకు దేశవ్యాప్త గుర్తింపు లభించింది. మహబూబాబాద్ మండలం చోక్ల తండా జీపీ పరిధి మేగ్యా తండాకు చెందిన బోడ వీరన్న జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. బెంగుళూరులోని ఐసీఏఆర్ ప్రధాన కేంద్రంలో గురువారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్, లేబర్, ఎంప్లాయిమెంట్ శాఖల మంత్రి సుశ్రీశోభా కరంద్లజే చేతుల మీదుగా వీరన్న అవార్డు స్వీకరించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పట్టుదలతో సాగు చేసిన రైతు బోడ వీరన్న.. మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నాగరాజు, ప్రశాంత్ ద్వారా సూచనల ద్వారా అద్భుత ఫలితాలు సాధించాడు. షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా బెంగుళూరు భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన అర్క తేజస్వి మిరప రకాన్ని 2024 ఖరీఫ్‌లో పండించి ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి సాధించాడు. దేశ వ్యాప్తంగా భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ ఎంపిక చేసిన 14 మంది ఉత్తమ ఉద్యాన రైతుల్లో బోడ వీరన్న ఒకరు. కాగా, వీరన్న పలువురు మిరప రైతులకు ఆదర్శంగా నిలిచాడని జిల్లా వాసులు పేర్కొన్నారు.

చెరువు కట్ట పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



జంపన్న (ఫైల్)

గార్ల: చెరువు కట్టపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి సీతంపేట సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బయ్యారం గ్రామానికి చెందిన కత్తి జంపన్న(47) గార్లకు చెందిన తన స్నేహితుడిని పార్టీ(విందు)ఇవ్వాలని కోరాడు. దీంతో స్నేహితుడు గార్ల పెద్దచెరువు కట్టపై పార్టీ ఏర్పాటు చేశాడు. దీనికి జంపన్న స్కూటీపై వచ్చాడు. పార్టీ ముగిసిన అనంతరం స్కూటీ తీస్తున్నాడు. క్రమంలో స్కూటీతో సహా చెరువు కట్ట పైనుంచి 13 అడుగుల లోతులో ఉన్న అలుగు బేస్‌మెట్ రాళ్లపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. స్నేహితులు వెంటనే 108లో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుడు.. జంపన్న మృతిచెందాడని నిర్ధారించాడు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రియాజ్‌పాషా వెల్లడించారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే..

భర్తపై హత్యాయత్నం

- వీడిన డాక్టర్ సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు మిస్టరీ..
- నిందితులు భార్య ఫ్లోరా, ప్రియుడు శామ్యూల్, సహకరించిన ఏఆర్‌కానిస్టేబుల్ రాజ్‌కుమార్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్



నిందితుల అరెస్ట్ చూపుతూ కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరామ్‌నాయక్

ఖిలా వరంగల్: వరంగల్ భట్టుపల్లి రహదారిపై ఎస్ఆర్ స్కూల్ సమీపాన ఈనెల 20న డాక్టర్ గాదె సుమంత్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో మిస్టరీ వీడింది. డాక్టర్ భార్యే ప్రధాన సూత్రదారి అని తేల్చారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను ప్రియుడితో కలిసి ఏఆర్ కానిస్టేబుల్ సహకారంతో హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులు గాదె ఫ్లోరా, ప్రియుడు సంగారెడ్డికి చెందిన ఎర్రోళ్ల శామ్యూల్, ఏఆర్ కానిస్టేబుల్ మంచుకూరి రాజ్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నందిరామ్‌నాయక్.. ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సై సురేశ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు.

హత్యకు రూ. లక్ష అడ్వాన్స్..

తన భర్త సుమంత్‌రెడ్డిని పక్కాగా హతమార్చేందుకు 15 రోజుల క్రితం ఫ్లోరా తన ప్రియుడు శామ్యూల్‌కి రూ.లక్ష అడ్వాన్స్ అందజేసింది. శామ్యూల్ రూ.50వేలు తన దగ్గర ఉంచుకుని, రూ.50వేలు ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌కు ఇచ్చాడు. అడ్వాన్స్ ముట్టడంతో ఏఆర్ కానిస్టేబుల్ విధులకు మూడు రోజులు సెలవు పెట్టాడు. ఈనెల 20వ తేదీన సంగారెడ్డిలో సుత్తి కొనుగోలు చేసి రాజ్‌కుమార్‌కు చెందిన బైక్‌పై ఇద్దరు నేరుగా కాజీపేట చేరుకున్నారు. సీసీ కెమెరాలు, జన సంచారం లేని చీకటి ప్రదేశాన్ని హత్యకు స్పాట్‌గా ఎంచుకున్నారు. రాత్రి 10.30కి సుమంత్‌రెడ్డి క్లినిక్ బంద్ చేసి తన కారులో కడిపికొండ బ్రిడ్జి మీదుగా భట్టుపల్లి నుంచి వరంగల్‌లోని ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో సుమంత్‌రెడ్డి ప్రయాణించే కారు వెంబడిస్తూ శ్యామ్యూల్, రాజ్‌కుమార్ బైక్‌పై బయలుదేరారు. భట్టుపల్లి దాటిన తర్వాత ఎస్ఆర్ స్కూల్ సమీపాన చిన్న బ్రిడ్జి వద్దకు రాగానే శామ్యూల్ సుత్తితో కారుఇండికేటర్‌పై కొట్టాడు. దీంతో భారీ శబ్ద రావడంతో సుమంత్‌రెడ్డి కారు రోడ్డు పక్కన నిలిపి వెనక వైపు వెళ్లి పరిశీలిస్తుండగా.. శామ్యూల్, రాజ్‌కుమార్ కలిసి సుమంత్‌రెడ్డి తల, మెడపై విచక్షణారహితంగా సుత్తితో కొట్టారు. దీంతో తీవ్రరక్తస్రావంతో సుమంత్‌రెడ్డి పడిపోగా చనిపోయాడనుకొని భావించిన నిందితులిద్దరు ఘటనా స్థలి నుంచి బైక్‌పై సంగారెడ్డికి పరారయ్యారు.

తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు..

సుమంత్ రెడ్డి హత్యాయత్నంపై తండ్రి ఆరోగ్య సుధాకర్ రెడ్డి వరంగల్ మిల్స్‌కాలనీ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, మిల్స్ కాలనీ ఎస్సై సురేశ్, కానిస్టేబుల్ బావుసింగ్, చంద్రశేఖర్, వెంకన్న, రాజు, జలేందర్, ఎండీ గౌస్, ఎఎఓ సల్మాన్ ఐటీకోర్ కానిస్టేబుల్ నగేశ్ నాలుగు బృందాలుగా ఏర్పడి సీసీ పుటేజీతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గురువారం నిందితులను సంగారెడ్డిలోని ఆదర్శకాలనీ కొండాపూర్‌లో ఎర్రోళ్ల శామ్యూల్, గాదె ఫ్లోరా, ఏఆర్ కానిస్టేబుల్ మంచుకూరి రాజ్‌కుమార్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ నందిరామ్ నాయక్ తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్‌తో ఒప్పందం..

వరంగల్ చేరిన అనంతరం కూడా ఫ్లోరా.. శామ్యూల్‌తో ఫోన్‌లో మాట్లాడేది. భర్త లేని సమయంలో శామ్యూల్‌ను ఇంటికి పిలిపించుకునేది. ఈ విషయం తెలుసుకున్న సుమంత్ రెడ్డి భార్యను మందలించేవారు. దీనికి తనకు విడాకులు ఇవ్వాలని ఫ్లోరా డిమాండ్ చేసింది. ఇందుకు సుమంత్ రెడ్డి నిరాకరించడంతో ఈ విషయంపై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో ఫ్లోరా, ప్రియుడి శామ్యూల్.. సుమంత్‌రెడ్డిని ఎలాగైనా కడతేర్చాలని నిర్ణయించుకున్నారు. శామ్యూల్ ఈ విషయాన్ని తన స్నేహితుడు ఏఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌కు వివరించాడు. సుమంత్‌రెడ్డి హత్యకు సహకరిస్తే సంగారెడ్డిలో భవనం నిర్మించి ఇస్తానని ఫ్లోరా చెప్పగా..రాజ్‌కుమార్ ఒప్పుకున్నాడు.

వివాహేతర సంబంధమే కారణం..

వరంగల్‌కు చెందిన గాదె ఆరోగ్య సుధాకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సుమంత్‌రెడ్డి, వరంగల్‌లోని షిర్డీ సాయినగర్‌కు చెందిన ఫ్లోరా 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తమ బంధువులకు చెందిన విద్యా సంస్థలను చూసుకునేందుకు భార్య ఫ్లోరాతో కలిసి సుమంత్‌రెడ్డి 2018లో వరంగల్ నుంచి సంగారెడ్డికి వెళ్లారు. అక్కడ సుమంత్‌రెడ్డి స్థానిక పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తుండగా, తన భార్య ఫ్లోరా బంధువుల విద్యా సంస్థల్లో పర్యవేక్షణతోపాటు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. బరువు తగ్గడానికి సంగారెడ్డిలోని సిద్ధు జిమ్‌సెంటర్‌కి వెళ్తుండేది. ఈ క్రమంలో సంగారెడ్డిలోని ఆదర్శకాలనీ కొండాపూర్‌కు చెందిన జిమ్ సెంటర్ కోచ్ ఎర్రోళ్ల శామ్యూల్ పరిచయమయ్యాడు. ఆ పరిచయం ఇద్దరి మధ్య ప్రేమ వివాహేతర సంబంధానికి దారితీసింది.ఈ విషయం సుమంత్‌రెడ్డికి తెలియడంతో గొడవ జరిగింది. సంగారెడ్డి నుంచి షిఫ్ట్ అయితే గొడవలు తగ్గుతాయని భావించిన సుమంత్‌రెడ్డి వరంగల్‌కు చేరారు. 2019లో ఫ్లోరా జనగామ జిల్లా పెంబర్తి సోషల్ వెల్ఫేర్ కళాశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తుండేది. ఆ కాలేజీ గతేడాది వరంగల్ రంగశాయిపేటకు మారడంతో విధులు ఇక్కడే నిర్వహిస్తుండగా.. సుమంత్‌రెడ్డి వరంగల్ హంటర్ రోడ్డు గ్రీన్‌వుడ్‌స్కూల్ సమీపాన వాసవికాలనీలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. సుమంత్‌రెడ్డి ప్రస్తుతం కాజీపేటలో ప్రైవేట్ ఆస్పత్రి నడుపుకుంటున్నాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి..

- ల్యాబర్తిలో ఘటన
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకులు, గ్రామస్తుల ఆరోపణ



విచారణ చేస్తున్న ఎస్సై రాజు

వర్ధన్నపేట: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ల్యాబర్తిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన బల్గురి వెంకటేశ్వర్లు(51) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో తనకున్న రెండెకరాల భూమిలో వరి సాగు చేసుకుంటున్నాడు. పంట పొలాన్ని హైదరాబాద్ నుంచి వస్తూపోతూ చూసుకుంటున్నాడు. ఈక్రమంలో శివరాత్రి పండుగకు ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వ్యవసాయ పంపు వద్దకు వెళ్లాడు. మోటారు తీగలు సరి చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కాగా, ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్ ఆఫ్ సిస్టం లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కుటుంబీకులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే రైతు మృతి చెందాడని గ్రామస్తులు ఆరోపించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వర్ధన్నపేట ఎస్సై రాజు తెలిపారు.

జంపన్న వాగు చెక్‌డ్యాం వద్ద చేపలు పడుతూ మరొకరు..

ఎస్ఎస్‌తాడ్వాయి : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి.. విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.ఈ ఘటన గురువారం మండలంలోని ఎల్బాక జంపన్న వాగు చెక్‌డ్యాం వద చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని వెంగ్లాపూర్‌కు చెందిన ఈక కృష్ణమూర్తి(50) జంపన్నవాగు చెక్ డ్యాం వద్ద కొంత మంది కరెంట్ తీగలతో చేపలు పడుతుండగా వారితో కలిశాడు. ఈ క్రమంలో ఒడ్డుపై కరెంట్ తీగను పక్కకు జరుపుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిసింది. ఈవిషయంపై ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిని అడగగా కృష్ణమూర్తి మృతిపై ఫిర్యాదు అందలేదన్నారు.



కృష్ణమూర్తి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు